అందాల హరిఇల్లు

- పేదల సొంతింటి కల సాకారం
- లబ్ధిదారుల్లో వెల్లివిరిస్తున్న ఆనందం
- పెదపూడి మండలంలో 4,043 మందికి ఇళ్ల స్థలాలు



జి.మామిడాడ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

పెదపూడి: ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు.. అంటుంటారు పెద్దలు. అలాంటి సొంతింటి కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అర్హులందరికీ అందాల హరివిల్లు అందివస్తోంది. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పుంజుకొంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు విడతలుగా పెదపూడి మండలంలో 4,043 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో గృహ నిర్మాణ శాఖ ద్వారా 2,981 మందికి గృహ నిర్మాణ రుణాలు మంజూరయ్యాయి. జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, సంపర, పుట్టకొండ తదితర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షల పూర్తి రాయితీతో ఇంటి నిర్మాణానికి రుణం అందిస్తున్నారు. ఇందులో రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు ఐరన్ కూడా ప్రభుత్వం అందజేస్తుంది. ఇంటి పునాదులు పూర్తయితే రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, మోల్డింగ్ వేసుకుంటే రూ.22,400, ప్లాస్టింగ్ పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. మహిళా సంఘాలకు అదనంగా మరో రూ.50 వేల రుణాన్ని ఇస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న జగనన్న కాలనీల్లో మెరక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అక్కడ రోడ్ల నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే.. ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు నిమగ్నమయ్యారు.

పెదపూడి మండలంలో లబ్ధిదారుల వివరాలు

మంజూరైన స్థలాలు	: 4,043
గృహ రుణాల లబ్ధిదారులు	: 2,981
పునాది స్థాయిలో ఇళ్లు	: 508
గోడలు పూర్తయినవి	: 72
మొత్తం పూర్తయిన ఇళ్లు	: 595
ఇంకా ప్రారంభించనివి	: 1,806

జగనన్న సహకారం మరువలేనిది



నా భర్త అబ్బారెడ్డి వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు కోసం నేనూ టైలరింగ్ చేస్తున్నాను. మేము అద్దె ఇంట్లోనే ఉంటూ అనేక ఏళ్లు ఇబ్బందులు పడ్డాం. జగనన్న సర్కారు వచ్చాక స్థానిక పంచాయతీ లేఅవుట్‌లో ఇచ్చిన స్థలంతో పాటు అందించిన రూ.1.80 లక్షల రుణంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మేము సొంతింట్లో జీవించడానికి సీఎం జగనన్న అందించిన సహకారం మరువలేనిది.

–మేడపాటి పద్మావతి, జి.మామిడాడ, లబ్ధిదారు

కలగా మిగులుతుందని అనుకున్నాం



కూలి పనికి వెళితే గాని పూట గడవని పరిస్థితి. సొంతిల్లు ఆశ కలగానే మిగులుతుందని అనుకున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సెంటున్నర స్థలంలో అందాల ఇల్లు కట్టుకున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా మాకు ఇంటి స్థలం ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రిగా వచ్చాక స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు నిర్మించారు. ఆయన రుణం తీర్చుకుంటాం.

–కర్రి పద్మావతి, జి.మామిడాడ, లబ్ధిదారు

సంతోషంగా జీవిస్తున్నాం



నేను చిన్న హోటల్ నిర్వహిస్తుండగా, నా భర్త అప్పారావు టైలరింగ్ పని చేస్తున్నారు. ఎన్నో ఏళ్లు అద్దె ఇళ్లల్లో మా కుటుంబం నరకం చూసింది. ముగ్గురు ఆడ పిల్లలతో ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జి.మామిడాడ గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చింది. ఇంటి రుణం కూడా ఇవ్వడంతో సొంతిల్లు నిర్మించుకుని సంతోషంగా జీవిస్తున్నాం. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

–నాళి అనంతలక్ష్మి, జి.మామిడాడ, లబ్ధిదారు

త్వరలోనే ఇంటివారమవుతాం



మాది చిన్న కుటుంబం. నా భర్త వెంకటరమణ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఐదో తరగతి, ఎల్‌కేజీ చదువుతున్న ఇద్దరు పిల్లలతో 12 ఏళ్లు అద్దె ఇళ్లలో జీవించాం. ప్రస్తుత ప్రభుత్వం స్థలం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ఆ పనులు పునాది స్థాయిలో ఉన్నాయి. త్వరలోనే ఇంటివారమవుతామనే ఆనందం చెప్పలేనిది. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– రాయుడు లలితాదేవి, జి.మామిడాడ, లబ్ధిదారు

క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాస్

సీతానగరం: మండలంలోని మునికూడలిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను రాజమహేంద్రవరం డివిజన్ డ్వామా ఏపీడీ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఉపాధి సిబ్బంది, మేట్లు, కూలీలతో మాట్లాడారు. ప్రతి కూలీ దినసరి వేతనం రూ.272 వచ్చేలా కొలతలు ప్రకారం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాగ శేషవేణి, టీఏ అంజనీ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోకవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్‌లో భాగంగా డాక్టర్ వనజా 44 మంది గర్భిణులకు రక్త పరీక్షలతో పాటు 16 మందికి స్కానింగ్ పరీక్షలు చేశారు. వైద్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు ఎలుకల దిబ్బలో పాస్టర్ డేవిడ్ పాల్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రాయుడు, పీహెచ్ఎన్ భారతి, హెచ్‌వీ సుజతా, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, ఝాన్సీ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కొంకుదురులో..

బిక్కవోలు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కొంకుదురు పీహెచ్‌సీ వద్ద ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ)లో భాగంగా గర్భిణులకు పరీక్షలు చేశారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌష్టికాహారంతో రక్తహీనత సమస్యను దూరం చేయవచ్చని అన్నారు.

దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు



కరకుదురులో మజ్జిగ పంపిణీ చేస్తున్న యూత్ సభ్యులు

పెదపూడి: పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయుక్తంగా ఉంటాయని న్యూ క్రాంతి యూత్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అన్నారు. కరకుదురులో ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండలు తగ్గే వరకూ రోజూ చల్లని మజ్జిగ, తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నేత, కాకినాడ మాజీ మున్సిపల్ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణకుమార్ మజ్జిగ అందించారన్నారు.

సాగునీరు విడుదల



తాపేశ్వరం లాకుల వద్ద సాగునీటిని విడుదల చేస్తున్న సత్తి రామారెడ్డి

అనపర్తి: ఖరీఫ్ సాగు కోసం తాపేశ్వరం లాకుల నుంచి వెదురుపాక వరకు ఉన్న నంబర్ 4 చానల్, వెదురుపాక చానల్ ద్వారా శుక్రవారం సాగునీటిని విడుదల చేశారు. తాపేశ్వరం లాకుల వద్ద జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లాకును ఎత్తి నీటిని విడుదల చేశారు. మండపేట మండలం తాపేశ్వరం– రాయవరం మండలం వెదురుపాక గ్రామాల మధ్య ఉన్న ఈ సాగునీటి కాలువల ద్వారా తాపేశ్వరం, అర్తమూరు, పాలమూరు, మహేంద్రవాడ, వెదురుపాక, రాయవరం గ్రామాల పరిధిలో ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రామారెడ్డి తెలిపారు. వెదురుపాక చానల్ ద్వారా సుమారు 5 వేలు, నంబర్ 4 చానల్ ద్వారా సుమారు 1,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు. ఈ కాలువలపై ఉన్న వ్యవసాయ భూములకు సాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరానికి చెందిన వడ్డారపు అరవాలమ్మ (32) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మట్టి ఖర్చుల కింద రూ.10 వేలను ఆమె తల్లికి రామలక్ష్మికి సర్పంచ్ కోండ్రపు ముత్యాలు అందించారు. వెల్ఫేర్ అసిస్టెంట్, పార్టీ నాయకులు కోండ్రపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ జేవీకే కిట్లు

మధురపూడి: పాఠశాలల పునఃప్రారంభం రోజైన ఈనెల 12వ తేదీనే విద్యార్థులకు జగనన్న విద్యకానుక కిట్లు అందించాలని కోరుకొండ ఎంఈఓ టి. కుశలవదొర తెలిపారు. కోరుకొండ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎస్ఎస్ఏ పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్‌పీలు, ఎంఆర్‌పీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలను బడికి పంపించే బాధ్యతను వారి తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. మండలంలోని 55 పాఠశాలల్లో 7,300 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు.

విద్యా కానుకల పరిశీలన

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ పాఠశాల వద్ద జగనన్న విద్యా కానుకల కిట్లను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి జెస్సీఫ్లోరెన్స్, ఎంపీడీఓ ఝాన్సీ పరిశీలించారు. మొత్తం 6,526 పుస్తకాలు వచ్చాయని, ఇంకా బ్యాగులు రావాల్సి ఉందన్నారు. అవి వచ్చిన వెంటనే పాఠశాలల వారీగా పంపిణీ చేస్తామన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్యం చేరువ

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు వైద్యం చేరువైందని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ.అనూష అన్నారు. ఈలకొలనులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. రోగులు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దొంతమూరులోని మండల పరిషత్ పాఠశాలలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.నాగ శ్రీవిద్య వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రామంలో నడవలేని, మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు.

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి



గోకవరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కర్నాకుల వీరాంజనేయులు

గోకవరం: మండలంలోని కామరాజుపేట పంచాయతీ శివరామపట్నంలో పేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దేవిచౌక్ వరకూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ వి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ శివరామపట్నంలో 36/2ఏ, 34/1, 35/2, 4/1 సర్వే నంబర్లలో గల 36 ఎకరాల సీలింగ్ భూమిని 70 నిరుపేద కుటుంబాలు 20 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరికి పట్టాలు మంజూరు చేయాలంటూ గ్రామ స్థాయి నంచి జిల్లా స్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. ఈ భూములను కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.రమేష్, కె..సతీష్, శ్రీకాంత్, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖాధికారులు పలు అంశాలను వివరించారు. వంగలపూడి సర్పంచ్ కొంచ అన్నపూర్ణ మాట్లాడుతూ జిల్లా పరిషత్ హైస్కూల్లో నాడు – నేడు పనులు జరగడం లేదని, ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని, విద్యార్థులు ఎక్కడ కూర్చుంటారని ప్రశ్నించారు. 200 సిమెంట్ బస్తాలు గడ్డకట్టాయని, పనులు నిలిపివేశారని దుయ్యపట్టారు. దీనిపై ఎంఈవో కె.స్వామి నాయక్ మాట్లాడుతూ నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు చేయాల్సింది ఆయా స్కూల్ హెచ్ఎంలేనన్నారు. ఈ విషయంపై ఆరాతీసి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సింగవరం సర్పంచ్ సంగన చినపోశయ్య మాట్లాడుతూ కైలాసభూమిలో విద్యుత్ సరిగ్గా ఉండటం లేదన్నారు. ఎన్ఆర్ఈజీఏస్‌లో గ్రామాల్లో కచ్చా డ్రైనేజీలు తీసేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ సత్యం మదన్‌బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు కోరారు. వైస్ ఎంపీపీ మదన్ బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం పంచాయతీ తాగునీటి కోసం బోరు వేసి వదిలేశారని, పైపులైన్ వేయలేదన్నారు. మండల సర్పంచ్ సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు సమయానికి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అవినాష్, టీపీ స్కీమ్ ఏఈ శివప్రసాద్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగశేషవేణి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



నరేంద్రపురంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకి పార్టీలకు అతీతంగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలు తెలుసుకుంటూ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎదురైన సమస్యలను ఆరాతీశారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్‌క్లినిక్‌లు, గ్రామ వలంటీర్ల పనితీరు ఏవిధంగా ఉందంటూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. గతంలో ఏ అవసరం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు ఎదురయ్యేవో ఒకసారి గుర్తు చేసుకోవాలని, గత నాలుగేళ్ల పాలన ఏవిధంగా ఉందో మననం చేసుకుని రాబోయే ఎన్నికలలో జగనన్న ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామంలో గడచిన నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, గతానికి ఇప్పటికీ ఉన్న వ్యత్యాసాన్ని మీరే గ్రహించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఇప్పటికే 98.4 శాతం హామీలను నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలుగుతున్నామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక, వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నాని బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, సొసైటీ చైర్‌పర్సన్ పబ్బన శ్రీనివాస్, నాయకులు ప్రగడ శివన్నారాయణ, రాంబాబు, తంగెళ్ల వెంకట్రావు, వీరరాఘవులు, బేదంపూడి సూర్యారావు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన



రంగంపేటలో తయారు చేసిన బొమ్మలను చూపుతున్న విద్యార్థులు

రంగంపేట: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడతాయని గ్రంథాలయ అధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారానికి 33 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ ద్వారా బొమ్మల తయారీని వివరించారు. యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. నీతి కథలపై పోటీలు నిర్వహించారు. తెలుగు వ్యాకరణం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీవీ ప్రసాద్, కె.దుర్గాప్రసాద్, నాగేంద్ర, అంజలి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అభినందనలు



జాకబ్ రాజు

మధురపూడి: కాంట్రాక్ట్ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కె.జాకబ్ రాజు అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయన కోరుకొండలో విలేకర్లతో మాట్లాడుతూ ఒప్పంద పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వారికి న్యాయమందించిన మంచినాయకుడన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో 2009లో విద్యాశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించగా, జగన్ ఈ సంవత్సరం అన్ని శాఖల్లోని ఉద్యోగులను క్రమబద్ధీకరించారన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే - డ్రైడే

మధురపూడి: కోరుకొండ మండలంలో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి, నీటి గుంటలను గుర్తించి, నీరు తొలగించారు. ఇంటి పరిసరాల్లోని కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డబ్బాలు, టైర్లలో నిల్వనీటిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని ప్రజలకు సూచించారు. దోమతెరలు తప్పకుండా వాడాలన్నారు. కోరుకొండ, కోటి కేశవరం, దోసకాయలపల్లి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం జరిగింది.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు

రాజానగరం: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు గ్రామ వలంటీర్ల పోస్టులకు ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బి.రామారావు కోరారు. జి.యర్రంపాలెం (అన్ రిజర్వుడు), కలవచర్ల (బీసీ–జనరల్), నరేంద్రపురం (ఓసీ – మహిళ), రాజానగరం (బీసీ–జనరల్)లో ఖాళీలున్నాయన్నారు. జూన్ ఒకటి నాటికి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండి, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

సీతానగరం: మండలంలోని నాగంపల్లి వద్ద ఆటో ఢీకొన్న ఘటనలో చీపురపల్లికి చెందిన చాకిరి వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా.. చీపురపల్లికి చెందిన చాకిరి వెంకన్న శుక్రవారం నాగంపల్లి జరిగే శుభకార్యానికి వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి చీపురపల్లికి తన మోటారుసైకిల్‌పై వస్తుండగా, నాగాలమ్మ ఆలయం వద్ద ఆ కార్యక్రమానికే వచ్చిన ఆటో ఢీకొంది. తీవ్రగాయాల పాలైన వెంకన్నను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని సమచారం.

వరకట్న వేధింపులపై కేసు

బిక్కవోలు: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.బుజ్జిబాబు శుక్రవారం తెలిపారు. రంగాపురం గ్రామానికి చెందిన గండికోట దుర్గమ్మ కుమార్తె నక్కా ఇంద్రాక్షికి అదే గ్రామానికి చెందిన నక్కా దుర్గయ్యతో ఏడాది కిందట వివాహం అయ్యింది. అప్పుడు కట్నంగా రూ.3 లక్షలు ఇచ్చినట్లు, తిరిగి అదనపు కట్నం కావాలని తన కూతురిని అల్లుడు వేధిస్తున్నాడని దుర్గమ్మ ఫిర్యాదు చేసింది. ఏడో నెల గర్భిణి అని కూడా చూడకుండా ఇంద్రాక్షిని కొట్టడంతో అనపర్తి సీహెచ్‌సీకి తీసుకువెళ్లామంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడ్డివామి దగ్ధం

బిక్కవోలు: ఊలపల్లి కుమ్మరివీధిలో ఓ గడ్డివామి శుక్రవారం దగ్ధమైంది. , రాయుడు నాగేశ్వరరావు చెందిన ఐదెకరాల గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో అనపర్తి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

వ్యర్థాలతో చెరువు కలుషితం



చెరువులో కలపడానికి గట్టుపై ఉంచిన వ్యర్థాలు

రంగంపేట: కొందరి చర్యలతో మొత్తం నీరే కలుషితం అవుతోంది.. ఫలితంగా మూగజీవాలు దాహార్తికి అల్లాడుతున్నాయి. ముకుందవరం ఊర చెరువులో చేపల కోసం కొందరు వ్యర్థాలు కలుపుతున్నారు. దీని వల్ల చేపల సంతతి పెంచాలనేది వారి ఉద్దేశం. ఈ చెరువులో కోళ్లపెంట, చిట్టు, తవుడు, కోళ్ల వ్యర్థాలు కలుపుతున్నారు. ఈ నీటిని పశువులు తాగడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయని, ఈ సమయంలో పశువులకు నీరు దొరక్క ఇబ్బందులు పడుతున్నామన్నారు.

విద్యాభివృద్ధికి సేవలు ఎనలేనివి



జీబీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: కేజీ నుంచి పీజీ వరకూ విద్యా సంస్థలను నెలకొల్పి అనపర్తి ప్రాంత విద్యాభివృద్ధికి గొలుగూరి బాపిరాజు (జీబీఆర్) ఎనలేని సేవలు అందించారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జీబీఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గొలుగూరి బాపిరాజు 27వ వర్ధంతిని స్థానిక విద్యా సంస్థల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా జీబీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులు, ముఖ్యంగా మహిళలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు జీబీఆర్ విద్యాసంస్థ ఏర్పాటు ద్వారా బాపిరాజు బాటలు వేశారన్నారు. అత్యున్నత ప్రమాణాలు, అతి తక్కువ ఫీజుతో విద్యా బోధన అందిస్తూ జీబీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. విద్యాసంస్థల అధినేత తేతలి కొండబాబు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి నూతనంగా జీబీఆర్ ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ అకాడమీని ప్రారంభించామన్నారు. పాలక మండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, డైరెక్టర్లు బి.రత్నారెడ్డి, డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, కె.హరినాథరెడ్డి, ఎం.ఉమామహేశ్వరరెడ్డి, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్‌ఎల్ స్వామి, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్, వాసంశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ ఆకాంక్షించారు. నన్నయ నగరపాలక హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న పి.శుశ్రూష హర్యానాలోని రోహతక్‌లో జరిగిన 5వ ఆల్ ఇండియా నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ 2023లో అండర్ 14 విభాగంలో మొదటి బహుమతి గెలుచుకుంది. బాలికను కమిషనర్ అభినందించారు. శుశ్రూష తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె రోహతక్ వెళ్లడానికి కమిషనర్ ఆర్థిక సాయం చేశారన్నారు.

సమర్థంగా వ్యర్థాల నిర్వహణ

స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు వేస్ట్ ప్రాసెసింగ్ కీలకమని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. నగరంలోని తడి, పొడి, హానికారక చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్లను సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. యార్డులోని తడిచెత్త విండ్రో ప్లాట్‌ఫాం షెడ్‌ను తనిఖీ చేశారు.

ప్రహరీ పనుల పరిశీలన

గోకవరం: మండల పరిధి వీరలంకపల్లిలో వెలుగు బాలికల హాస్టల్ ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం వెఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగు బాలికల హాస్టల్ ప్రహరీ కూలిపోవడంతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఆయన ఆదేశాలతో అధికారులు పాఠశాల ప్రహరీ నిర్మాణం పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇందిరా రాణి, ఎంపీటీసీ రాంప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ అల్లాడి రాంబాబు పాల్గొన్నారు